# కావేరి

ఫోను రింగవుతోంది.

బద్ధకంగా లేచి రిసీవరందుకుని 'హలో' అన్నాడు శ్రీనివాసమూర్తి.

"నేను భానుప్రకాష్‌ని" "అది సరే, కొంపలంటుకుపోయినట్లు ఇంత పొద్దున్నే..." "కావేరి చనిపోయింది బావా"

భానుప్రకాష్ కంఠంలో కంగారు.

"నాన్సెన్స్, కావేరి పోవడమేంటి" నమ్మలేనన్నట్లు అన్నాడు శ్రీనివాసమూర్తి.

"పరిహాసం కాదు బావా. . పచ్చి నిజం. నిన్న రాత్రి ఒంటి గంటకి కావేరి మనందర్నీ విడిచిపెట్టి వెళ్ళిపోయింది. అర్ధరాత్రి ఫోను చేసినా మీరు రాలేరు. అందుకే ఇప్పుడు చేస్తున్నాను. కావేరి అంటే కల్పనకు ప్రాణం అని నీకు తెలుసు. వెంటనే బయల్దేరు.

ఏదో అనబోయాడు శ్రీనివాసమూర్తి.

అంతలోనే ఫోను కట్టయింది.

కల్పన కోసం అటు ఇటు చూశాడు శ్రీనివాస మూర్తి. ఎక్కడా ఆమె జాడ లేదు. బాత్‌రూంలో ఉందేమో!. . . పొద్దున్నే ఈ పిడుగులాంటి వార్త వింటే ఇంకేమైనా ఉందా?. . . వాళ్ళ అనుబంధం తనకు బాగా తెలుసు. అక్కని చూడాలంటూ నెలకోసారైనా తన చేత విధిగా ప్రయాణం కట్టిస్తుంటుంది కల్పన. వెళ్ళినప్పుడెల్లా దానికిష్టమని చెప్పి గంపెడు గులాబీలు మోసుకెళుతుంది. వారానికి రెండు మార్లైనా ఫోన్‌లో మాట్లాడ కుండా ఉండలేదు. ఈ వార్త వింటే గుండె ఆగిపోదూ!. . . వాస్తవానికి

కావేరి చావు కబురు విని తనే తట్టుకోలేకుండా ఉన్నాడు. ఇహ కల్పన సంగతి చెప్పాలా?

ఉన్నట్లుండి అతడి ఆలోచనలు కావేరి మీదకు మళ్ళాయి. ఏం పాపం చేసుకుంది, ఆ పిల్లకు వయసుకు తగ్గ గ్రోత్ లేదు. దానికితోడు ఛాయ కూడ తక్కువవడంతో ఆమెను చేసుకోడానికి ఎవరూ ముందుకు రాలేదు. రూపురేఖల మాట ఎలా ఉన్నా ఆమె మనసు మాత్రం వెన్నపూసే. ఎవరైనా కష్టాల్లో ఉంటే చూడలేదు. తనవంతుసహాయంగా వాళ్ళకు ఏం చేయడానికైనా సిద్ధపడుతుంది. అటువంటి మంచి పిల్లకి అప్పుడే నూరేళ్ళూ నిండిపోయాయా! దేవుడెంత నిర్దయుడు!. . .

ఫోను రింగవడం విన్నదేమో, "ఎక్కడ నుంచండి ఆ ఫోను. . . కావేరి చేసిందా" తడి జుట్టు ఆరబెట్టుకుంటూ గదిలోకొచ్చి అడిగింది కల్పన.

"ఇంకెక్కడ కావేరి?" విషయం చెప్పాలా మానాలా అనుకుంటూనే నోరు విప్పాడు.

కావేరి మరణవార్త విని కుప్పలా కూలిపోయింది కల్పన.

భార్యని స్పృహలోకి తీసుకురావడానికి చాలా శ్రమపడ్డాడు శ్రీనివాసమూర్తి.

"ఏమిటండి ఈ ఘోరం. నిన్న కాక మొన్న ఫోన్లో మాట్లాడింది. అప్పుడే దానికి భూమ్మీద నూకలు చెల్లిపోయాయా" అంటూ భోరున విలపించింది.

అర్ధాంగి ఆవేదన చూసి చలించిపోయాడు శ్రీని వాసమూర్తి.

"నువ్విలా ఏడుస్తూ కూర్చుంటే కావేరి కడసారి చూపులకు కూడ నోచుకోం. గుండె దిటవు చేసుకుని బయల్దేరు" భార్య చెయ్యి పుచ్చుకుని నెమ్మదిగా పైకి లేవనెత్తాడు.

ఆటో వచ్చింది.

దారి పొడవునా కల్పనను ఓదారుస్తూనే ఉన్నాడు శ్రీనివాసమూర్తి.

బస్సులో కూర్చుందన్నమాటేగాని కల్పనకు పరిసరాలేవీ కానరావడంలేదు. మనసు జ్ఞాపకాల పొరల్లోకి జారుకుంది.

★ ★ ★

తల్లిపోయినప్పుడూ ఇలాగే ఏడుస్తూ పుట్టింటికెళ్ళింది. తన మాట ఎలా ఉన్నా అమ్మ మృతదేహం మీద పడి గుండె పగిలేలా రోదుస్తున్న కావేరిని చూస్తే దుఃఖం ఆగడంలేదు కల్పనకి. తనకు తల్లి లేకున్నా కొండంత అండగా భర్త ఉన్నాడు, ప్రేమను పంచిచ్చే పిల్లలున్నారు. మరి కావేరికి?. . అన్నయ్యలున్నారన్న మాటేగాని వాళ్ళామెను ఎంతవరకు ఆదుకుంటారన్నది ప్రశ్నే. ఎద లోతుల్లోంచి తన్నుకొస్తున్న దుఃఖాన్ని

పళ్లతో బిగబట్టి కావేరిని ఓదార్చే ప్రయత్నం చేసింది. ఆమె బాల్యమంతా కష్టాలతోనే గడిచింది కావేరికి వయసుతో సమానంగా శారీరక ఎదుగుదల లేకపోవడంతో ఆమెను వైద్యులకు చూపించారు. పరీక్షలు చేసి ఆమెలో ఏ లోపల లేదన్నారు డాక్టర్లు. పెరుగుదల కోసం మందులిచ్చారు. అయినా ఆశించిన ఫలితం కానరాలేదు.

హైస్కూల్లో చదూకునేటప్పుడు కూడ కావేరి ఎన్ని  అవమానాల్ని ఎదుర్కొంది. వయసు మీరినా ఆమె చిన్నపిల్లలా కనిపించడంతో తోటి విద్యార్థినులు ఆమెను 'బుజ్జీ' అని పిలిచేవారు రకరకాలుగా ఆమెను ఆటపట్టించేవారు. టీచర్స్ కూడ 'పొట్టమ్మాయ్' అని పిలవడం ఆమెను మరింతగా బాధించేది. ఏ జట్టులోను సూటవదని ఆటల్లో కూడ ఆమెను ఆమడ దూరంలో ఉంచేవారు. అంతా తనని అంటరాని దానిగా చూస్తున్నారన్న ఫీలింగు రావడంతో బడి మానేసింది. సహజంగా తెలివైందవడం వల్ల ఇంటోనే  చదువుతో పాటు కుట్లు, అల్లికలు కూడ అవలీలగా నేర్చుకుంది.

తనకెవరితో ప్రమేయం లేదన్నట్లు కాలం దాని పని అది చేసుకుపోతోంది. ఈడొచ్చిన కావేరికి సంబంధాలు చూడటం మొదలుపెట్టారు. కావేరిని చూడటాని కొచ్చిన వాళ్ళంతా కల్పననైతే చేసుకుంటామనేవారు. తోబుట్టువు పెళ్ళికి తను అడ్డంకి కాకూడదన్న తలంపుతో కావేరిని చూడటానికి ఎవ్వరైనా వస్తే తనేమూలో దాక్కునేది కల్పన. పొట్టిగా ఉండే కావేరికి పొట్టిగా వున్న వరుడు దొరకకపోతాడా అనుకున్నారు. అలా అని ఎంతలేదనుకుని కావేరిని వదిలేసి కల్పనకు సంబంధాలు చూడటం మొదలు పెట్టారు.

అక్క స్థితికి జాలిపడటం మినహా తను మాత్రం ఏమి చేయగలదు? దానికో మార్గం చూపించమని  దేవుణ్ణి వేడుకుంది. ఆ రోజు తనకు ఇప్పటికీ గుర్తే. కావేరికి వళ్ళు కాలిపోతూ వుంటే డాక్టర్ని పిలుచుకొచ్చి మందులు వేసి "ఇప్పుడెలా ఉందక్కా" అని అడిగింది ప్రేమగా తల నిమురుతూ.

"కాళ్ళు నొప్పి పెడుతున్నాయి" అతి కష్టం మీద అనగలిగింది కావేరి.

పార్వతీదేవి గుడి చూట్టూ పదకొండు వందల సార్లు ప్రదక్షణ చేస్తే ఏ కన్యకైనా ఇట్టే పెళ్ళైపోతుందని ఎవరో చెప్పారట. వాళ్ళ మాటల్ని ఆచరణలో పెట్టిందీ పిచ్చిపిల్ల. అలసట మూలాన్నె ఆ జ్వరం.

కల్పన హృదయం ద్రవించుకుపోయింది.

"పెళ్ళి జీవితంలో ఒక భాగమే తప్ప అదే జీవితం కాదక్కా. ముందు నువ్వు నీ కాళ్ళ మీదనిలబడటానికి ప్రయత్నించు భగవంతుడు నీకు తెలివితేటలిచ్చాడు. వాటిని

సద్వినియోగం చేసుకుని ఏదో ఒక రంగంలో బాగా కృషిచేసి పైకి రావడానికి ప్రయత్నించు. లాల్ బహదూర్ శాస్త్రి పొట్టివాడైనా దేశ ప్రధానై ప్రపంచ మన్ననలను పొంది ఎంతో గట్టివాడనిపించుకోలేదా? 'నేను పొట్టిదాన్ని' అన్న న్యూనతా భావాన్ని ముందు నీ మదిలోంచి తొలగించుకో." ఆమెలో ఆత్మస్థైర్యాన్ని నింపేందుకు ప్రయత్నించింది కల్పన.

తర్వాత కాలంలో ఎన్నో అనూహ్య మార్పులు చోటుచేసుకున్నాయి. కన్న తండ్రి హఠాత్మరణంతో పెద్దకొడుకుగా తన బాధ్యతల్ని తీర్చుకోవడం కోసం ఆగమేఘాల మీద సంబంధాలు చూసి కల్పనకి పెళ్ళి నిశ్చయించాడు భానుప్రకాష్.

తనకు అత్యంత ప్రియమైన ఎర్రగులాబీలతో జడకుట్టి కల్పనను పెళ్ళికూతుర్ని చేసింది కావేరి. వివాహానంతరం అత్తవారింటికి బయలుదేరే ముందు ఆమెకు ప్రేమతో ఓ ప్యాకెట్టు అందించింది.

కావేరిచ్చిన కానుక ఏమిటా అని ఆదుర్దాగా ప్యాకెట్టు విప్పింది కల్పన.

ఆమె కళ్ళు జిగేల్‌మన్నాయి.

పదులు, యాభైలు, వందలు. . . సుమారు యాభై వేలు ఉంటాయి.

"ఇంత డబ్బు నీకేక్కడిదే?" విస్తుపోతూ అడిగింది కల్పన.

"నేను దాచుకున్న డబ్బు. నాన్న నాకు పై ఖర్చులు కోసం ఇచ్చిన డబ్బు. లంగాలు, జాకెట్లు కుట్టగా వచ్చిన డబ్బు" సంజాయిషీ ఇస్తున్నట్లు అంది కావేరి.

"అంత కష్టపడి కూడబెట్టిన డబ్బు నాకెందు కిచ్చే స్తున్నావ్" అడిగింది కల్పన.

"దాని అవసరం మరి నాకు లేదు"

"డబ్బు అవసరం లేకపోవడమేంటి? నీక్కావలసిన వన్నీ కొనుక్కోవచ్చు కదా" అన్నాడు శ్రీనివాసమూర్తి.

"నాకు వేటిమీద కోరికలు లేవు. ఈ డబ్బు మా చెల్లాయికి పెళ్ళి కానుకగా ఇస్తున్నాను. కాదనకండి బావగారూ" అభ్యర్థనగా అంది కావేరి.

"ఇంతకీ నువ్వా డబ్బు దేనికోసం కూడబెట్టావో చెబితే తప్ప నేను దానిని ముట్టనైనా ముట్టను" అంది కల్పన.

చెప్పక తప్పింది కాదు కావేరికి.

"కోరినంత కట్నం గుమ్మరిస్తే మన వ్యవస్థలోఏ పిల్లకైనా ఇట్టే పెళ్ళైపోతుందని పక్కింటి అనూరాధ ఆంటీ చెప్పింది. కట్నం విషయంలో నాన్నకి సహాయపడదామని..."

అంటూ కళ్ళనీరు నింపుకుంది.

ఆమె కంటతడి చూడగానే కల్పన హృదయం కలు క్కుమంది. దుఃఖం పొంగుకొచ్చింది. గభాలున కావేరిని వాటేసుకుని ముద్దులతో ఆమె ముఖం ముంచెత్తింది.

★ ★ ★

తల్లికి అంత్యక్రియలు జరిపించి ఇంటికొచ్చారు అన్నయ్యలు.

కర్మకాండ ముగియడంతో కుటుంబ సభ్యులు మినహా మిగిలిన వాళ్ళంతా నిష్క్రమించారు.

తల్లి రాసిన వీలునామా బయటకు తీసి అందరి ముందు చదివి వినిపించాడు భానుప్రకాష్.

అయితే అమ్మ తన పేరనున్న ఆస్తినంతా మనందరికీ సమంగా పంచి ఇచ్చిందన్న మాట" అన్నాడు జయప్రకాష్.

"ఔను. కావేరి విషయానికొస్తే ఆమె బాధ్యత ఎవరు తీసుకుంటారో వారికి ఆమె తదనంతరం ఆ వాటా అనుభవించే హక్కు ఉంటుంది."

భానుప్రకాష్ మాటలకు సన్నగా నవ్వుతూ "నిజమే. కావేరి ఒంటరిగా ఉండలేదు. ఆమెకు ఎవరో ఒకరిఅండ అవసరం. మీరంతా 'ఊ' అంటే ఆ పిల్ల బాధ్యత నేను తీసుకుంటాను" అన్నాడు జయప్రకాష్.

"ఊహుం, ఇంటికి పెద్దవాణ్ణి నేను. ఆ పిల్ల నా దగ్గరుండటమే న్యాయం" అన్నాడు భానుప్రకాష్.

కావేరి పట్ల వాళ్ళంతా ఎందుకుంత శ్రద్ధ కనపరు స్తున్నారో కల్పనకు తెలుసు. "అక్కకి నేనంటే ప్రాణం. అది నా దగ్గరే ఉంటుంది" అంది వాళ్ళ ఎత్తుల్ని చిత్తుచేస్తూ.

"దీనికెంత ఆశ. కొడుకులతో సమానంగా వాటా కొట్టేయడమే కాక కావేరి వాటా కూడ లాగేయాలనా" అనుకున్నారు భాను, జయ ప్రకాష్‌లు లోలోన.

జయప్రకాష్ ఏదో అనబోతూ వుంటే "ఈ ఇంటి అల్లుడిగా నేనో మాట చెబుతాను వింటారా" అన్నాడు శ్రీనివాసమూర్తి.

చెప్పమన్నట్లు చూశారంతా.

"కావేరి పట్ల మీ కుటుంబ సభ్యులకున్న అభిమానానికి నా జోహార్లు. నిజం చెప్పాలంటే ఆమె తన పెద్దన్నయ్య భానుప్రకాష్ దగ్గర ఉండటమే ధర్మం."

కల్పన తన అన్నదమ్ములకు వైరి కావడం ఇష్టం లేకనే అలా అన్నాడు శ్రీనివాసమూర్తి. అతడి మాట కొట్టిపారేయలేక అయిష్టంగానే సరేననవలసి వచ్చింది జయప్రకాష్‌కి.

ఫలితంగా భానుప్రకాష్ నీడను ఆశ్రయించింది కావేరి

★ ★ ★

గమ్యం చేరుకుంది బస్సు.

ఆలోచనల నుంచి బయటపడింది కల్పన.

గబగబా బస్సు దిగి ఆటో ఎక్కారు శ్రీనివాస దంపతులు.

మధ్యాహ్నం ఒంటి గంటవుతోంది. ఎండ ఎర్రగా ఉంది. వైశాఖ మాసం ఇంకా ప్రవేశించనేలేదు. అప్పుడే సూర్యభగవానుడు తన ప్రతాపాన్ని చూపిస్తూ భూదేవిని అగ్నిగుండంలా మార్చేస్తున్నాడు.

ఆటో దిగి ఒక్క ఉదుటన ఇంట్లోకెళ్ళింది కల్పన.

కావేరి ఎలా పోయిందో వచ్చిన వాళ్లకు చెబుతున్నాడు భానుప్రకాష్

"కావేరీ!" అంది ఏడుస్తూ.

"మీ కోసం పన్నెండు వరకు చూసి ఇప్పుడే అంత్యక్రియలు జరిపించి వచ్చానమ్మా" అన్నాడు భానుప్రకాష తువ్వాలుతో కళ్ళు వత్తుకుంటూ.

ఆ మాటకు హతాసురాలైంది కల్పన.

"అదేమిటి బావా పొద్దున్నే కదా ఫోను చేశావు. ఎంత తొందరగా బయలుదేరినా పన్నెండు దాటు తుందని తెలీదా" అన్నాడు శ్రీనివాసమూర్తి.

"శవాన్ని ఇంట్లో పెట్టుకుని కూర్చున్నంతసేపు మన వీధిలో వాళ్ళెవ్వరూ పొయ్యి ముట్టించరు. వాళ్ళనింకా ఇబ్బంది పెట్టడం దేనికని. . ." తను చేసిన పనిని సమర్థించుకున్నాడు భానుప్రకాష్

"నువ్వు చేసిందేమీ బాగోలేదు బావా. కావేరిని చూడటం కోసం ఉన్నపళంగా బయలుదేరి అంత దూరం నుంచి వచ్చాం" నిష్ఠూరంగా పలికాడు శ్రీని వాసమూర్తి.

మూల కూర్చుని మౌనంగా రోదిస్తోంది కల్పన. అక్క తలపులతో బరువెక్కిపోయిన హృదయం కన్నీరు కాల్వలై పారుతున్నా తేలికపడటంలేదు.

"అది సరే, సడన్‌గా కావేరి పోవడమేంటి?" అడిగాడు శ్రీనివాసమూర్తి. "జ్వరం

బావా. నూటమూడు డిగ్రీల జ్వరం. అది విషజ్వరమని కనుక్కోలేకపోయాం. ఆ మాత్ర, ఈ మాత్ర తెచ్చి వేశాం. ఫలితం లేకపోవడంతో డాక్టరికి చూపించాం. మందులు వేశా. అయినా నా చిట్టితల్లిని కాపాడుకోలేకపోయాను. నేను హంతకుణ్ణి. నన్నేం చేసినా పాపం లేదు. నన్ను కొట్టండి, నరకండి'' పిచ్చి వాడిలా బుర్ర మొత్తుకుంటూ ఏమవసాగాడు భానుప్రకాష్.

అతడెంతగా రోదిస్తున్నా శ్రీనివాసమూర్తికి ఆ వ్యక్తిపై రవంతైనా సానుభూతి కలగటంలేదు.

కావేరి లేని ఆ కొంపలో మరి ఉండబుద్ధి కాలేదు కల్పనకి.

భార్య అభీష్టం మేరకు మరునాడు తిరుగు ప్రయాణానికి సిద్ధమయ్యాడు శ్రీనివాసమూర్తి.

“కావేరి నీకే కాదు నాకూ తోబుట్టువేనమ్మా. మీరిలా అర్ధంతరంగా వెళ్లిపోతే ఆ పిల్ల ఆత్మ శాంతి స్తుందనుకుంటున్నావా? చిన్నప్పటి నుంచి దానికి నువ్వంటేనే ఎంతో ఇష్టం. ప్లీజ్ నా మాట వినండి. పన్నెండో రోజు వరకు ప్రయాణం మాట తలపెట్టవద్దు'' బ్రతిమలాడాడు భానుప్రకాష్.

అర్ధాంగిని ఆ పేందుకు తను కూడ తనవంతు ప్రయత్నం చేశాడు శ్రీనివాసమూర్తి.

ఎవరెన్ని చెప్పినా వెళ్లిపోవడానికే నిర్ణయించుకుంది కల్పన.

“కావేరి చనిపోయిందంటే ఎందుకో నమ్మలేకుండా ఉన్నాను. అంత్యక్రియలకు అన్నయ్య తొందరపాటు నా అనుమానాన్ని మరింత బలపరుస్తోంది'' అంది ఇంటికొస్తూనే.

“నిజానిజాలు ఆ సర్వేశ్వరుడికే తెలియాలి'' నిర్లిప్తంగా, నిర్వికారంగా బదులిచ్చాడు శ్రీనివాసమూర్తి.

**(జూలై 2007 'పత్రిక' మంత్లీ)**